
ఆంధ్రజ్యోతి

5



ANDHRAJYOTHY

నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

శుక్రవారం 22 ఆగస్టు 2025

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0



అచ్చంపేటలోని బస్తీ దవాఖాన

బస్తీ దవాఖానలకు సుస్తీ

» వైద్య సిబ్బంది లేక ఇబ్బందులు

7

వృద్ధుడి దారుణ హత్య

» వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో కలకలం



కిష్టయ్య హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

7

ప్రత్యేక మార్కెట్ యార్డు ఏర్పాటు ఎప్పుడో?

» రాష్ట్రంలో 10 కొత్త మార్కెట్ యార్డులు ఏర్పాటు

» తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

» అందులో అయిజకు దక్కని చోటు



అయిజలోని సబ్‌మార్కెట్ యార్డ్

నష్టం అపారం

» నాగర్‌కర్నూల్ జిల్లాలో కూలిన 68 ఇళ్లు

» 30 గ్రామాలకు రాకపోకలు బంద్

» పుట్టీలో పాఠశాలలకు వెళ్లిన చెర్లతిర్మలాపురం విద్యార్థులు



కొల్లాపూర్ మండలం రామాపురం వాగు కింద సాగుచేసిన వరిలో మోకాళ్లలోతు నిలిచిన వరదనీరు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు నాగర్‌కర్నూల్ జిల్లాలో అపారనష్టాన్ని మిగిల్చాయి. వందల ఎకరాల్లో పత్తి, మిర్చి పంటకు నష్టం వాటిల్లగా వరి కూడా దెబ్బతిన్నది. జిల్లాలో 30గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి, దేవరకొండ, నియోజకవర్గం చెన్నంపేట గ్రామాల మధ్య హైలెవల్ బ్రిడ్జి లేక రాకపోకలు స్తంభించిపోయాయి. ఉప్పునుంతల మండలం వెల్టూరు నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. మన్నెవారిపల్లి నుంచి అక్కారం, బక్కలింగాయపల్లి మార్గంలో నక్కలగంటి వద్ద ఇదే పరిస్థితి ఉత్పన్నమైంది. కల్వకుర్తి రెవెన్యూ డివిజన్‌లో రఘుపతిపేట, రామగిరి వద్ద దుందుభీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. పంజుగుల, తుర్కలపల్లి వద్ద ప్రవాహం అధికం కావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వల్లంపల్లి, వంగూరు గేటు నుంచి జూపల్లి మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. మండలంలో ముసురు వర్షాలకు పంజుగుల, తాండ్రా, కల్వకుర్తి పట్టణంలో ఐదుఇళ్లు కూలిపోయాయి. మండలంలో 58ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. సస్యరక్షణ చర్యలు లేక పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతినగా పెద్దకొత్తపల్లి మండలంలో మోకాళ్లలోతు నీళ్లల్లో వరి పంట మునిగిపోయింది. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాలల్లో దాదాపు 68 ఇళ్లు కూలిపోయాయి. అధికారులు మాత్రం ఈ విషయంలో స్పష్టతనివ్వడం లేదు. మీరు నివేదిక ఇవ్వండి పూర్తిస్థాయిలో మేము పరిశీలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉండడంతో ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి తాత్కాలికంగా సహాయక చర్యలు చేపట్టి మిగతా అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా రాకపోకలు నిలిచిపోవడంతో 21పాఠశాలలకు సెలవు ప్రకటించారు. విద్యార్థులు తాము బడికి వెళ్తామని భీష్మించడంతో పుట్టిలో వారిని చేరవేసేందుకు తాడూరు మండలం చెర్లతిర్మలాపూర్ నుంచి ఉయ్యాల వాడ, నాగర్‌కర్నూల్ మీదుగా అనుమతిస్తున్నారు.

రాకపోకలకు అంతరాయం

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో రహదారు లు అస్తవ్యస్తంగా మారాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని ఎండబెట్ల, నల్లవెల్లి, నాగనూల్, తూడుకుర్తి బిజినేపల్లి మండలంలోని వడ్డెమాన్, ఖానాపూర్‌తోపాటు గంగారం ప్రాంతాలల్లో వా గులు,

వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపో కలకు అంతరాయం ఏర్పడింది. తాడూరు మం డలంలోని సిర్సవాడలో దుందుభీ నది ఉధృ తంగా ప్రవహిస్తుండడంతో తాడూరు, తెలకప ల్లి, రఘుపతిపేటగ్రామాల మధ్య రాకపోకలకు అం తరాయం ఏర్పడింది. నాగర్‌కర్నూల్ నియో జక వర్గంలో ఇప్పటి వరకు అందిన అధికారిక సమా చారం మేరకు తిమ్మాజిపేటలో 4, బిజి నేపల్లిలో 4, నాగర్‌కర్నూల్ మండలంలో 8 ఇళ్లు కూలినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

నీట మునిగిన వరి

భారీ వర్షాలు కొల్లాపూర్ నియోజకవర్గాన్ని కూడా కుంగదీశాయి. ఇప్పటి వరకు అందిన ప్రాథమిక సమాచారాన్ని బట్టి సింగోటం శ్రీవారి సముద్రం కింద 20ఎకరాల వరి పంట నీట మునిగింది. కోడేరు, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి మండలాల్లో కూడా వరి పంటకు ఇదే పరిస్థితి ఉత్పన్నమైంది.



నాగర్‌కర్నూల్ పట్టణంలోని కేసరి సముద్రం వద్ద జల దిగ్బంధంలో ఉన్న ఇళ్లు



వెల్దండ మండలంలోని కొట్ర గ్రామంలో వర్షానికి కూలిన ఇల్లు

అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా యంత్రాంగంపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ ప్రశంసలు



జిల్లా అధికారులకు పలు సూచనలు చేస్తున్న అరవింద్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగర్ కర్నూల్ జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా జిల్లా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ ప్రశంసించారు. గురువారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తోపాటు అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వరదల వల్ల తలెత్తిన సమస్యలు, వాటి నివారణకు చేపట్టిన చర్యలు శాఖల వారీగా అధికారులు సమగ్ర నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పని చేయడం వలన ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. భవిష్యత్తులో కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు మరింత వేగంగా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ సహాయక చర్యల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నెంబర్‌ను అందుబాటులో ఉంచామన్నారు. వర్షపాత తీవ్రతను గుర్తించి అధికారులు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దేవ సహాయం, అమరేందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా పక్కదారి

» తెలంగాణ రైతుల పేరుతో విక్రయం

» టాప్20 దుకాణాలలో బార్డర్ వద్దే 15 దుకాణాలు

» అంతా అయిపోయాక చెక్‌పోస్టులు

» అరిగోస పడుతున్న అన్నదాతలు



యూరియా కోసం గట్టులో బుధవారం పాస్ బుక్‌లు లైన్‌లో పెట్టి నిలుచున్న రైతులు

గద్వాల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో యూరియా కోసం రైతులు వ్యవసాయ పనులు వదిలి దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. రోజులు తరబడి దుకాణాల వద్ద నిలబడినా ఒక్క బస్తా యూరియా ఇవ్వకపోవడంతో ఓపిక నశించి రాస్తారోకో చేసి నిరసన కూడా తెలిపారు. అయినా యూరియా ఇవ్వడం లేదు. జిల్లాలోని టాప్ 20 విక్రయ కేంద్రాలలో 15 కేంద్రాలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక బార్డర్‌ల వద్ద ఉండటంతో యూరియా పక్కదారి పట్టించారనే ఆరోపణలు వస్తున్నాయి. 20 కేంద్రాలకు ఆగస్టు 6వ తేదీ వరకు 5,522 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు. అందులో అత్యధికంగా రాష్ట్ర బార్డర్‌లోని 15 కేంద్రాలలో 4,302 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించారు. బల్గెర, గట్టు, మాచర్ల, నందిన్నె, కేటీదొడ్డి అయిజ, వడ్డేపల్లి వంటి ప్రాంతాలలో అధికంగా మెట్ట పంటలు సాగుచేస్తారు. కానీ యూరియా విక్రయం ఎక్కువగా అక్కడే జరిగింది. దీనిని బట్టి చూస్తే వ్యాపారులు తెలంగాణ యూరియాను పక్క రాష్ట్రాలకు తరలించారనే అనుమానం అధికారులు వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు పరిశీలనలో విస్తుపోయే నిజం బయటపడింది. అంతా ఇక్కడి రైతుల ఆధార్ కార్డుపైనే విక్రయం జరిగింది. అంతా అయిపోయిన తర్వాత దీంతో అధికారులు అప్రమత్తమై పోలీస్ యంత్రాంగంతో చెక్‌పోస్టులను పెట్టించారు.

రాష్ట్ర సరిహద్దు దుకాణాలలో ఇలా...

రాష్ట్ర సరిహద్దు దుకాణాలలో ఆగస్టు 6వ తేదీ వరకు విక్రయాలు ఇలా జరిగాయి. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం అయిజలో 643.725 మెట్రిక్ టన్నులు, బల్గెర రైతు కేంద్రంలో 535, అయిజలోని మరో కేంద్రంలో 360, నందిన్నెలోని ఆగ్రోస్ కేంద్రంలో 357, వడ్డేపల్లి రైతు సేవా కేంద్రంలో 311, జూలకల్‌లోని కేంద్రంలో 263, అయిజ పీఏసీఎస్‌లో 414, గట్టు ఆగ్రోస్ కేంద్రంలో 225, కేటీదొడ్డిలోని ఆగ్రోస్ కేంద్రంలో 213, మాన్‌దొడ్డిలోని ఆగ్రోస్ కేంద్రంలో 211, ఉప్పేరు పీఏసీఎస్‌లో 195, మాచర్లలోని శ్రీనివాసలో 195, ఆలంపూర్ పీఏసీఎస్‌లో 189, అయిజలోని ఆగ్రోస్ కేంద్రంలో 332, అలంపూర్ ఆగ్రోస్ కేంద్రంలో 175మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించారు. ఈ విక్రయ కేంద్రాల పరిధిలో 80శాతం మెట్ట పంటలే సాగు చేస్తారు. అయిజ నుంచి ఏపీకి, గట్టు, బల్గెర, నందిన్నె, కేటీదొడ్డి, మాచర్ల నుంచి రాయిచూర్‌కు తరలిపోయినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

వరి అధికంగా సాగు చేసే ప్రాంతాల్లో..

వరి అధికంగా సాగుచేసే ప్రాంతాల్లో ఇప్పటి వరకు యూరియా తక్కువగానే విక్రయం జరిగింది. ఇప్పుడిప్పుడే కలుపు దశలో ఉన్న వరికి యూరియా వేసేందుకు రైతులు సిద్దమవుతున్నారు. జూరాల, నెట్టంపాడు పరిధిలోని ధరూర్, గద్వాల, ఎర్రవల్లి, ఇటిక్యాల ప్రాంతంలో యూరియా ఇప్పటి వరకు ఆగ్రోస్, పీఏసీఎస్‌ల ద్వారా 1,220 మెట్రిక్ టన్నులే విక్రయించారు. ఇందులో గద్వాల ఆగ్రోస్ కేంద్రం ద్వారా 304 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్‌ల ద్వారా 288, ఆగ్రోస్ కేంద్రం మార్కెట్ యార్డ్ 256, రాధాక్రిష్ణ ట్రేడర్స్ 189, పీఏసీఎస్ ధరూర్ ద్వారా 178 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించారు. ఇప్పుడు ఇక్కడి రైతులకు యూరియా అవసరమైంది. కానీ యూరియా కొరత ఏర్పడింది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది యూరియా అధికంగానే సరఫరా చేశారు.

గతేడాది సెప్టెంబరు, ఈ ఏడాది ఆగస్టు 18వ తేదీ వరకు విక్రయించిన యూరియా మెట్రిక్ టన్నులలో

మాసం	2024 సం.	2025 సం.
ఏప్రిల్	114.295	350.595
మే	205.677	441.399
జూన్	1,015.156	2,147.985
జూలై	3,469.255	8,756.765
ఆగస్టు	4,943.930	2,482
సెప్టెంబరు	4,711.335	
మొత్తం	14,459.648	

అధికారులు చెబుతున్న కారణాలు

జూలైలో అధిక వర్షపాతం, ప్రాజెక్టుల ద్వారా కాలువలకు త్వరగా నీరు వదలడం, త్వరగా పత్తి, వరి సాగుచేయడం, సోషల్ మీడియాలో యూరియా కొరతపై కథనాలు రావడంతో రైతులు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. దీంతో యూరియా కొరత వచ్చిందని, అయినా రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచుతున్నామని అధికారులు చెబుతున్నారు.

అడగలేవని అలుసా?

» మూగజీవాలపై సర్కారు నిర్లక్ష్యం

» నామమాత్రంగా పశువైద్యశాలలు

» పాడి సంపదపై తీవ్ర ప్రభావం

» 50 రకాల మందులకు గాను అందుబాటులో ఉన్నవి 17 రకాలే

» నట్టల నివారణ మందుల ఊసే లేదు

» మంత్రి నియోజకవర్గంలోని రెండు మండలాల్లో వైద్యులు కరువు

వ్యవసాయం తరువాత వనపర్తి జిల్లాలో పాడి పరిశ్రమనే ప్రధాన జీవనాధారం. వ్యవసాయ పంటలు ఆరు మాసాల తర్వాతే దిగుబడి వస్తుంది. అప్పుడే రైతు చేతికి డబ్బు వస్తుంది. కానీ ఆరు నెలలుగా కుటుంబ పోషణ, పంట పెట్టుబడికి డబ్బులు అవసరమవుతాయని పాడి పశువులను పెంచుకుంటున్నారు. ఈ పాడి ద్వారా వచ్చే ఆదాయం పంట పెట్టుబడికి, కుటుంబ పోషణకు ఆసరాగా ఉంటుందని రైతులు పాడి పశువులను పెంచుకుంటున్నారు. కానీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో పశువులకు రోగమొస్తే వైద్యులు కరువయ్యారు. పశువులకు వైద్యం చేసేందుకు దాదాపు 50 రకాల మందులు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. కానీ ప్రస్తుతం జిల్లాలో 17 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉండటంతో పశువులకు పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

- వనపర్తి, ఆంధ్రజ్యోతి



వనపర్తి మండలం కడుకుంట్లలో గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు (ఫైల్)

6



పెద్దకొత్తపల్లి సింగిల్ విండో కార్యాలయం దగ్గర యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం బారులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి పీఏసీఎస్ కార్యాలయం వద్ద గురువారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. పీఏసీఎస్ భవనంపైన టోకెన్‌లు ఇవ్వడంతో భవనంపైకి బారులు తీరారు. కేవలం ఒక రైతుకు రెండు బస్తాల యూరియా ఇస్తే ఎలా సరిపోతుందని, పంట విస్తీర్ణాన్ని బట్టి ఎకరాకు ఒక సంచి చొప్పున ఇచ్చినా బాగుండేదని వాపోతున్నారు. ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా చాలా అవసరమవుతుందని, రైతుల కష్టాలు అధికారులకు, పాలకులకు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు యూరియా డిమాండ్‌ను బట్టి అందుకు అనుగుణంగా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

కేజీబీవీ విద్యార్థిని మృతి

» ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



ఖిల్లాఘణపురం కేజీబీవీ పాఠశాలలో మృతి చెందిన బాలిక జ్యోతి కుటుంబ సభ్యులతో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ నరేశ్

6

పనితీరు మెరుగుపర్చుకోవాలి

ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించిన కలెక్టర్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖలో సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యరంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కువ మంది ఓపీ రోగులు ప్రయోజనం పొందేలా మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది సెప్టెంబరు 1వ తేదీ నుంచి తమ హాజరు బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలని సూచించారు. ప్రోగ్రాం అధికారులు వారంలో రెండు సార్లు పీహెచ్‌సీలను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సిద్దప్ప తదితరులు ఉన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు



బీచుపల్లి పుష్కరఘాట్లు మునిగి ఒడ్డున ఉన్న శివాలయానికి తాకుతూ పారుతున్న వరద

6

సీఎంఆర్ ధాన్యాన్ని సకాలంలో అందించాలి

- అదనపు కలెక్టర్ కీమ్యానాయక్

పాన్‌గల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యాన్ని సకాలంలో అందించాలని అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్ రైస్‌మిల్ యజమానిని ఆదేశించారు. గురువారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని కేతపల్లిలో మేహరూన్, మహమ్మదాపూర్ గ్రామంలో మల్లికార్జున్ రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలు, ప్రాసెసింగ్ వివరాలను పరిశీలించారు. ధాన్యాన్ని నిర్ణీత గడువులోగా మిల్లింగ్ చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. జాప్యం జరిగితే ప్రభుత్వం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధ్యతలు విస్మరిస్తే చర్యలు

- లింగాల తహసీల్దార్‌పై ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆగ్రహం



కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట(లింగాల), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతలను విస్మరిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హెచ్చరించారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని లింగాల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఉదయం 12 గంటలైనా కార్యాలయానికి అధికారులు రాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్‌లకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయాల్సిన అధికారులు బాధ్యతలు విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగాల మండలంలో పనిచేస్తున్న అధికారులు తమ వ్యవహార శైలిలో మార్పుకొని ప్రజల కోసం పనిచేయాలని సూచించారు.

లిఫ్టుల మరమ్మతుకు నిధులు

» రూ. 4.45 కోట్లు మంజూరు



అమరచింత మండలం ఈర్లదిన్నె గ్రామ శివారులో ఉన్న చంద్రఘడ్ లిఫ్ట్

అమరచింత, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అమరచింత మండలంలోని చంద్రఘడ్, నర్వ మండలంలోని నాగిరెడ్డిపల్లి లిఫ్టుల మరమ్మతుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మూడు రోజు ఆయకట్టు రైతులు మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఆయన రెండు లిఫ్టుల మరమ్మతు కోసం రూ.4.45 కోట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. మంజూరైన నిధుల్లో నాగిరెడ్డిపల్లి లిఫ్టుకు రూ. 2.53 కోట్లు, చంద్రఘడ్ లిఫ్టుకు రూ.1.92 కోట్లు కేటాయించారు.

మరికల్ వద్ద రోడ్డు మరమ్మతులు

తిమ్మాజిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట రోడ్డుపై గుంతలు ఏర్పడి పలువురు రోడ్డు ప్రమాదానికి గురైతే కానీ అధికారులకు, నాయకులకు తెలిసి వచ్చినట్లుంది. ఎట్టకేలకు మరికల్ కమాన్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను గురువారం సిమెంట్, కంకర వేసి రోడ్డును పూడ్చారు. ఇటీవల కురుస్తున్న వర్షానికి మరికల్ కమాన్ వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారి ఆ దారిన వెళ్లే వాహన చోదకులు కింద పడి తీవ్ర గాయాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. బుధవారం రాత్రి శవాన్ని చూసేందుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో మరికల్ కమాన్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన గుమ్మకొండకు చెందిన తండ్రీకొడుకులు, తిమ్మాజిపేటకు చెందిన ఇద్దరు యువకులు గాయపడి ఆసుపత్రిలో చేరారు. ఈ ఘటనపై పలువురు సోషల్ మీడియాలో పెట్టడం, గురువారం పత్రికల్లో రావడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదయ్య దగ్గర ఉండి రోడ్డు మరమ్మతులు చేయించారు.

పనులు త్వరితగతిన ప్రారంభించాలి

ఊర్కొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అవసరాల నిమిత్తం ప్రారంభించిన పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకోరావాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పనుల జాతరపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల అవసరాల కోసం పనులు ప్రారంభించిన వాటికి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, ఏపీవో నరసింహ, పీఆర్ ఏఈ మహేందర్, మిషన్ భగీరథ ఏఈ జగన్‌లాల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్పాహారం అందించడం అభినందనీయం

వంగూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయడం అభినందనీయమని తహసీల్దార్ మురళీమోహన్ అన్నారు. గురువారం మండలంలోని తుమ్మలపల్లి యూపీ పాఠశాలలో ఆర్ఫుల్‌మెస్ కన్హాహ శాంతి వనం డాక్టర్ నిహారిక బృందం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో బ్రహ్మాచారి, ఎంఈవో మురళీమోహనచారిలు హాజరై ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు అతని కుమారుడు, కూతురుని తాను పనిచేసే పాఠశాలలో చదివిస్తున్నాడు. విద్యార్థి రిక్కితేజ్ ఇటీవల హైదరాబాద్‌లో గిసిన బొమ్మల ఆర్ట్ గ్యాలరిని కన్హాహ శాంతివనం వారు పరిశీలించి విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్వాల్‌రెడ్డి, హెచ్ఎం సైదులు, చిన్నయ్య, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి నియామకంపై హర్షం

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సారస్వత పరిషత్తు సర్వ మండలి సభ్యునిగా ప్రముఖ కవి కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి నియమాకంపై నెలపొడుపు సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి వహీద్ ఖాన్, గౌరవ అధ్యక్షుడు కందికొండ మోహన్, ఎదిరేపల్లి కాశన్న, కల్వకోలు మద్దిలేటి, ముచ్చర్ల దినకర్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. తెలుగు భాసా సాహిత్య వికాసానికి ఆయన చేసిన విశేష సేవలను గుర్తించి నందుకు తెలంగాణ సారస్వత పరిషత్తుకు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

» రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామంలో పోచమ్మ గుడి నిర్మాణానికి గు రువారం ఆయన రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాల నిర్మాణం, శాంతి, భక్తికి మార్గం చూపు తుందన్నారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు బోనాలు, పండుగలు, జాతరలు, ఉత్సవాలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రుక్నద్దీన్, దేవయ్య, శ్రీనివాసులు, సురేష్‌గౌడ్, కృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎగవేతదారుల ఆస్తులు.. అటాచ్!

● అది నగరంలోని న్యూటౌన్ ఏరియా.. అక్కడ సిండికేట్ వ్యాపారులకు సంబంధించిన వ్యాపారం కోసం గతంలో పురపాలిక శాఖ 18 దుకాణాల సముదాయాన్ని అద్దెకు ఇచ్చింది. అయితే వాళ్లు అద్దె చెల్లించకపోవడంతో నాలుగేళ్ల క్రితం దుకాణాలను సీజ్ చేసింది. అయినా వ్యాపారులు బకాయి చెల్లించేందుకు ఆసక్తి చూపకపోగా వ్యాపారం వదులుకున్నారు.. ప్రస్తుతం ఈ దుకాణాలపై రూ.45 లక్షల వరకు బకాయి ఉంది.

● పద్మావతి కాలనీలో స్టీల్, సిమెంట్ వ్యాపారులకు 6 దుకాణాలు కేటాయించారు. ఈ దుకాణాలపై రూ.25 లక్షల వరకు అద్దె బకాయి ఉంది. ఈ దుకాణాలను కూడా సీజ్ చేయగా ఇప్పటివరకు అద్దె వసూళ్లు కావడం లేదు. ఇలాంటి వ్యాపారులనుంచి బకాయిల వసూలుకు అధికార యంత్రాంగం అంతర్గత ప్రయత్నాలు మొదలు పెట్టింది.

» న్యాయ నిపుణులతో సంప్రదింపులు.. ఆస్తులు వెతికేపనిలో అధికారులు
» అద్దెబకాయి వసూళ్ల కోసం పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు
» మొండిబకాయిలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
» బకాయి మాఫీ అంత ఈజీ కాదు.. వసూళ్లూ కష్టమే



పాలమూరు నగరపాలక సంస్థ కార్యాలయం

మహబూబ్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అద్దె చెల్లించకుండా ఎగవేస్తున్న మొండి బకాయిలపై యంత్రాంగం దృష్టి సారించింది. రకరకాల ప్రయత్నాలు చేసినా వారినుంచి కనీస స్పందన కరువవడంతో న్యాయపరంగా ముందుకెళ్లాలనే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇప్పటికే హైకోర్టు న్యాయవాదులతో పాటు పలువురు న్యాయవాదులతో అధికారులు చర్చలు చేస్తున్నారు. సదరు వ్యాపారుల ఆస్తులు గుర్తించే పనిలో పడ్డారు. వారి ఆస్తులను లీగల్‌గా అటాచ్ చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అప్పుడే బకాయిలు వసూలు చేయగలమన్న ఆలోచనతో ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

ఇదిలా ఉండగా వేలం పాడి దుకాణాలు దక్కించుకుని వేలం ప్రకారం అద్దెలు చెల్లించకపోవడంతో బకాయి కోట్లకు చేరడంతో వీటి వసూలు కోసం అధికారులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. నగరంలోని మూడు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న దుకాణాలకు సంబంధించిన వ్యాపారులపై గతనెల 28న ఆయా పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ అద్దె దుకాణాల రూపేణా రావాల్సిన అద్దె, బకాయి వసూలుకోసం డీఫాల్టర్‌లపై క్రిమినల్ చర్యలు తీసుకుని తమకు రావాల్సిన బకాయిని చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌కు కూడా అద్దె వసూళ్ల విషయంలో లేఖ రాయడం జరిగింది.

దుకాణాలను సీజ్ చేసినా రూ.75 లక్షలే వసూలు

నెలరోజుల క్రితం నగరంలోని 70 అద్దె దుకాణాలకు కార్పొరేషన్ అధికారులు తాళాలు వేశారు. వీటిపైన రూ. 12 కోట్ల అద్దె బకాయి ఉండటంతో దుకాణాలను సీజ్ చేశారు. వ్యాపారులు ఎప్పటిలానే పొలిటికల్ పైరవీలతో కేవలం బకాయిలో 5 శాతం చెల్లింపులు మాత్రమే చేసి దుకాణాలు తెరిపించుకున్నారు. ఇలా 5 శాతం చెల్లింపుల ద్వారా కేవలం రూ.75 లక్షల ఆదాయం మాత్రమే సమకూరింది. మళ్లీ ఈనెల అంటే నేడు మరో 5 శాతం చెల్లింపులు చేయాల్సి ఉంది. మరి అది కూడా చెల్లిస్తారా లేదా తేలాల్సి ఉంది. అద్దె దుకాణాల అద్దె నెలకు రూ.70 నుంచి రూ.1.50 లక్షల వరకు ఉన్నాయి. అయితే అప్పట్లో పురపాలిక మంత్రిగా ఉన్న కేటీఆర్‌చే పైరవీలు చేసుకుని వేలం కన్నా ముందున్న అద్దెకు 300 శాతం అధనంగా అద్దె చెల్లించాలని ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకే ఇప్పటివరకు వ్యాపారులు అద్దె చెల్లిస్తూ వస్తున్నారు. దీంతో వేలంలో పాడిన డబ్బులు ప్రతినెల బకాయిల రూపంలో పెరుగుతూనే ఉంది తప్పా తగ్గడం లేదు. వ్యాపారులు సీజ్ చేసినపుడల్లా మొత్తం బకాయిలో 5 శాతం చెల్లించడం వల్ల అది ఏ మూలకు సరిపోవడం లేదు. దీంతో 5 శాతం చెల్లిస్తే రెండుమూడు నెలల్లోనే బకాయి 10 శాతానికి చేరుతుంది. దీంతో అద్దె వసూలు కష్టసాధ్యం కావడంతో కార్పొరేషన్ అధికారులు బకాయిల వసూలుకు మల్లగుల్లాలు పడాల్సి వస్తోంది.

అద్దె మాఫీ అంత ఈజీ కాదు

నాడు కమిషనర్‌గా ఉన్న దేవ్‌సింగ్ నాయక్ ఏడేళ్ల క్రితం వేలంపాట నిర్వహించి అద్దెలు ఫిక్స్ చేశారు. ఏడేళ్లుగా వ్యాపారులు అద్దె తగ్గించడానికి చేయని ప్రయత్నం అంటూ లేదు. అయితే అద్దె తగ్గించం, బకాయి మాఫీ చేయడం అంత ఈజీ కాదు. నాడు మంత్రులుగా ఉన్న శ్రీనివాస్‌గౌడ్, కేటీఆర్‌లు చేసిన ప్రయత్నాలన్నీ బుట్టదాఖలయ్యాయి. అయితే అద్దెతగ్గించడం లేదంటే మాఫీ చేయడం అనేది కేబినెట్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కేబినెట్ నిర్ణయం తీసుకోవాలంటే ఒక్క పాలమూరుపైనే తీసుకోవడం కుదరదు. రాష్ట్రంలో చాలా పురపాలికలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే ఇది అంత ఈజీ కాదన్న విషయం అందరికీ తెలిసినా తాత్కాలిక ఉపశమనం కోసం పైరవీలు చేసుకుంటున్నారు.

అడగలేవని అలుసా..!



గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

17 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి

పశువైద్యానికి సంబంధించి 50 రకాల మందులకు గాను 17 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది మొదటి క్వార్టర్‌కు సంబంధించి రూ.30 లక్షల బడ్జెట్ పెట్టారు. నేటి వరకు 17 రకాల మందులు వచ్చాయి. మిగతావి కూడా త్వరలోనే వస్తాయి.

- వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

» మూగజీవాలకు అందని వైద్యం

వనపర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమనే ప్రధాన జీవనాధారం. ఇక్కడ అత్యధిక శాతం రైతులు వ్యవసాయానికి తోడుగా పాడి రంగాన్నే నమ్ముకున్నారు. కానీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో పశువైద్యం ఆటకెక్కింది. మందులే కాకుండా వైద్యం చేసేందుకు వైద్యులు కరువయ్యారు. దీంతో పశువులు రోగాల బారిన పడితే చాలా మంది రైతులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ప్రధానంగా పశుసంవర్ధక శాఖలో ఏర్పడిన వైద్య సిబ్బంది ఖాళీలు పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

అరకొర మందులే

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో 15,15,787 పైచిలుకు పశు సంతతి ఉంది. అందులో 9,76,832 గొర్రెలు, 3 లక్షల కోళ్లు, 80 వేల మేకలు, 75,089 ఆవులు, ఎద్దులు, 72,531 బర్రెలు, 8,922 పందులు ఉన్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ పశువులకు అన్ని రోగాలకు గాను దాదాపు 50 రకాల మందులు అందుబాటులో ఉండాలి. కానీ ప్రస్తుతం జిల్లాలో 17 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మొన్నటి వరకు అవి కూడా లేక చాలా మంది రైతులు డాక్టర్లతో రాయించుకొని ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేశారు. రెండు సంవత్సరాల నుంచి గొర్రెలకు, మేకలకు వేసే నట్టల నివారణ మందులు కూడా ప్రభుత్వం పంపిణీ చేయడం లేదు. దీంతో చాలా మంది గొర్రెల కాపర్లు ప్రైవేటు దుకాణాలలో కొనుగోలు చేసి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేస్తున్నారు. ఇటీవల ఈ విషయాన్ని దిశా సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి కూడా తీసుకువెళ్లారు.

అరకొర సిబ్బందితో ఇబ్బంది

వనపర్తి జిల్లా వ్యాప్తంగా ప్రాంతీయ పశు వైద్యశాలలు 2, ప్రాథమిక పశువైద్యశాలలు 19, పశు ఆరోగ్య ఉప కేంద్రాలు 29, మొత్తం 50 ఉన్నాయి. వాటిల్లో మొత్తం పశువైద్య సిబ్బంది 121 మంది ఉన్నారు. ఇంకా 25 పశు వైద్య సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని ఆత్మకూరు, అమరచింత మండలాల్లో అసలు పశువైద్యాధికారులే లేరు. మొన్నటి వరకు మహబూబ్‌నగర్ నుంచి ఇన్‌చార్జీగా వచ్చిన వైద్యుడు కొన్ని రోజులు ఇక్కడ పని చేసి మళ్లీ మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఈ రెండు మండలాలకు పెబ్బేరు వైద్యాధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా మంత్రి వాకిటి శ్రీహరి పశుసంవర్ధక శాఖపై, పశువైద్యంపై ప్రత్యేక చొరవ తీసుకుని పశువైద్యశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

కేజీబీవీ విద్యార్థిని మృతి

» ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
» నెల రోజులుగా బాలికకు అనారోగ్యం
» సకాలంలో సమాచారం ఇవ్వని సిబ్బంది
» నిలదీసిన తల్లిదండ్రులు, బంధువులు



ఖిల్లాఘణపురం కేజీబీవీ తెలుగు మీడియం పాఠశాల ఆవరణలో మృతి చెందిన బాలిక జ్యోతి కుటుంబ సభ్యుల రోదనలు

ఖిల్లాఘణపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం కేజీబీవీలో చదువుకుంటున్న 9వ తరగతి విద్యార్థిని జ్యోతి ఈనెల 17న అనారోగ్యంతో మృతి చెందింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనపై బాలిక తల్లి కవిత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జ్యోతి ఈ నెల 8న తోటి విద్యార్థి తల్లిదండ్రుల సెల్‌ఫోన్ నుంచి ఇంటికి కాల్ చేసింది. తన ఆరోగ్యం బాగాలేదని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు అదే రోజు రాత్రి బాలికను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. పసిరికలు తీవ్రంగా ఉన్నాయని, మెరుగైన వైద్యం అవసరమని డాక్టర్లు తెలపడంతో మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ 3 రోజులు ఉంచి చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆకృతి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి యశోద ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని, గాంధీ ఆసుపత్రికి తరలించాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో ఈ నెల 17న గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గంమధ్యలో బాలిక మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని తమ స్వగ్రామం కోతుకుంట తండాకు తరలించి, ఈ నెల 18న అంత్యక్రియలు చేశారు. బాలిక తల్లిదండ్రులు, బంధువులతో కలిసి గురువారం పాఠశాలకు చేరుకొని నిరసన తెలిపారు. తమకు సకాలంలో సమాచారం ఇవ్వకపోవడం వల్లే జ్యోతి మృతి చెందిందని కన్నీటి పర్యంతం అయ్యారు. సమస్యలను తల్లిదండ్రులకు చెప్పుకునేందుకు విద్యార్థులు భయపడుతున్నారని ఆరోపించారు.

ఉపాధ్యాయులు తమను బెదిరిస్తారని తమ కూతురు చెప్పినట్లు తల్లి కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కుమార్తె నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నా తమకు సమాచారం ఎందుకు ఇవ్వలేదంటూ ఉపాధ్యాయులను నిలదీశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నరేశ్, నాయబ్ తహసీల్దా ర్ లక్ష్మీకాంత్ పాఠశాలకు చేరుకున్నారు. సంఘటనపై విచారణ చేపట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

యూరియా అక్రమ రవాణాకు అడ్డుకట్ట

» నారాయణపేట జిల్లా గుడేబల్లూరు శివారులో చెక్‌పోస్ట్

కృష్ణ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : యూరియా అక్రమ రవాణాను అరికట్టేందుకు నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడేబల్లూరు శివారులోని చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ నవీద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక రైతులకు అందాల్సిన యూరియా అక్రమంగా ఇతర ప్రాంతాలకు రవాణా అవుతున్నట్లు తమకు సమాచారం అందిందని తెలిపారు. దాన్ని అరికట్టేందుకు సరిహద్దులో నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చెక్‌పోస్టు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న ట్లు తెలిపారు. ఎరువుల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించి, అక్రమంగా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ శ్రీనివాస్ చెక్‌పో స్టును తనిఖీ చేసినట్లు తెలిపారు.

జూపల్లిలో ఘనంగా ఈదమ్మ బోనాలు



బోనాల ఊరేగింపుతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

చారకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లి గ్రామంలో గురువారం ఈదమ్మ దేవత బోనాలు వడ్డెర కులస్థులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అలంకరించిన బోనం కుండలను మహిళలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా డప్పు చప్పుళ్ల నడుమ వెళ్లి ఈదమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

స్కూటీ పేరుతో మళ్లీ మోసం

» దివ్యాంగుల సంఘం అధ్యక్షురాలినంటూ బురిడీ
» రూ. 23 వేలు చెల్లించాక ఫోన్ స్విచ్ఆఫ్


గద్వాల క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్కూటీ మంజూరయ్యిందంటూ బుధవారం ఓ వ్యక్తిని మోసం చేసిన సైబర్ నేరస్థులు, గురువారం మరో వ్యక్తి నుంచి రూ. 23 వేలు స్వాహా చేశారు. బాధితుడు హనీఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలంలోని చెనుగోనిపల్లికి చెందిన ఖాజా హుస్సేన్ గతంలో దివ్యాంగుల స్కూటీ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అందులో అతడి అల్లుడు అయిన హనీఫ్ ఫోన్ నెంబర్ ఇచ్చాడు. ఆ నెంబర్‌కు గురువారం సాయంత్రం ఫోన్ కాల్ వచ్చింది. తన పేరు రామలక్ష్మి అని, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షురాలిని అని తెలిపింది. జిల్లాకేంద్రంలోని శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఉన్నాయని చెప్పింది. మీ మామకు స్కూటీ వచ్చిందని, వెంటనే డబ్బులు చెల్లించాలని అడిగింది. దీంతో స్కూటీ ఫ్రీగానే వస్తుంది కదా హనీఫ్ అడిగాడు. తాము ఉద్యమిస్తేనే స్కూటీలు మంజూరవుతాయని తెలిపిన ఆమె రూ. 10 వేలు కడితే దాన్ని ఇంటికే పంపిస్తామని చెప్పింది. ఓ స్కూటీ ఫొటోను వాట్సాప్‌లో పంపించింది. దీంతో ఆమెను నమ్మిన అతడు వెంటనే ఆమె అడిగిన డబ్బును ఫోన్‌పే చేశాడు. అలాగే బండి రిజిస్ట్రేషన్‌కు రూ.12,500 అవుతాయని, దివ్యాంగులకు రూ. 7,500 చెల్లిస్తే సరిపోతుందని చెప్పడంతో ఆ మొత్తాన్ని కూడా ఫోన్‌పే చేశాడు. అంతటితే ఆగని ఆమె, వేరే వారికి కూడా బండి అలాట్ అయ్యిందని, కానీ అతడు వద్దంటున్నాడని చెప్పింది. మీకు కావాలంటే రూ. 12 ఇస్తామని తెలిపింది. మొదట రూ.6,500 ఇవ్వండి, స్కూటీ ఇంటికి వచ్చాక మిగితా డబ్బు పంపించాలని చెప్పడంతో ఆ డబ్బు కూడా ఫోన్‌పే చేశాడు. ఇలా మొత్తం రూ. 24 వేలు చెల్లించి, స్కూటీని ఎప్పుడు పంపిస్తారు అని అడిగేలోపలే ఫోన్ స్విచ్ఆఫ్ కావడంతో తాను మోసపోయానని గ్రహించి హనీఫ్ వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

లక్కీ లాటరీ పేరుతో కుచ్చుటోపీ

మూసాపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : లక్కీ లాటరీ పేరుతో కొందరు వ్యక్తులు ముగ్గురి నుంచి డబ్బు తీసుకొని మోసం చేశారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని వేముల, తుంకినీపూర్‌లలో మణికంఠ, భరత్‌కుమార్, సూర్య, విజయ్ అనే వ్యక్తులు పది రోజుల క్రితం టాటా సుమోలో తిరిగారు. తాము లక్కీ లాటరీ పెట్టామని, లాటరీ తగిలితే స్కూటీలు, కూలర్లు, ఫ్రిజ్జులు ఇస్తామని ప్రజలను నమ్మించారు. వేములకు చెందిన రమేష్‌తో రూ.3600 కట్టించుకున్నారు. నాలుగు రోజుల తర్వాత అతడికి ఫోన్ చేసి చేసి మీకు స్కూటీ వచ్చిందని చెప్పి, రూ.6 వేలు ఫోన్‌పే చేయించుకున్నారు. మరో సారి వీడియో కాల్ చూసి, స్కూటీని చూపించి, మరో రూ.7 వేలు తీసుకున్నారు. అలాగే తుంకినిపూర్‌కు చెందిన శేఖర్‌తో రూ.3600 తీసుకున్నారు. ఆ తర్వాత వీడియో కాల్ చేసి టీవీ, ఫ్రిజ్జు చూపించి, మరో రూ.13 వేలు ఫోన్‌పే చేయించుకున్నారు. అలాగే చెన్నయ్య అనే వ్యక్తి నుంచి రూ.8600 డబ్బు తీసుకున్నారు. ఆ తర్వాత నిర్వాహకులు ఫోన్ చేసి స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. వారి నుంచి మళ్లీ సమాచారం లేకపోవడంతో గురువారం పోలీసులను ఆశ్రయించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హన్వాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జారి కింద పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. హన్వాడ ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండల కేంద్రానికి చెందిన బోయ వెంకటయ్య (61) ఈనెల 19న రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ జారి కిందప డ్డాడు. దీంతో అతడి తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



బీచుపల్లి దగ్గర పరవళ్లు తొక్కుతున్న కృష్ణానది



మేడిపూర్ వద్ద కొనసాగుతున్న దుందుభీ నది ప్రవాహం

కృష్ణమ్మ పరవళ్లు

ఎర్రవల్లి, అగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి దగ్గర కృష్ణానది పరవళ్లు తొక్కుతున్నది. ఎగువ జలాశయాల నుంచి జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరడంతో జూరాల దగ్గర ఎక్కువ మొత్తంలో గేట్లను తెరిచి నీరు వదిలారు. దీంతో బీచుపల్లి వద్ద ఉన్న పుష్కరఘాట్లు గురువారం మునిగి ఒడ్డున ఉన్న శివాలయానికి నీరు తాకింది. కృష్ణానది నీళ్ల నది మధ్యలో ఉన్న నిజాంకొండను చుట్టుముట్టాయి. నది దగ్గర భక్తులు, పర్యాటకుల తాకిడి పెరగడంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఇటిక్యాల ఎస్ఐ రవి పర్యవేక్షణలో భద్రత ఏర్పాటు చేశారు.

దుందుభీ నదికి స్వల్పంగా తగ్గిన వరద

తాడూరు, (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని దుందుభీ నదికి గురువారం వరద స్వల్పంగా తగ్గింది. అయినా తాడూరు మండలంలోని సిర్సవాడ వద్ద నుంచి కల్వకుర్తి, మిడ్జిల్, ఊర్కొండ మండలాలకు రాకపోకలు కొనసాగే పరిస్థితి లేదు. మేడిపూర్ వద్ద వరద ప్రవాహం కొంత ఎక్కువగానే ఉంది. ఎట్టిదార్‌పల్లి గ్రామంలో ఇళ్ల మధ్యలో నిలిచిన నీరు అలాగే ఉంది. దీంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోయిల్‌సాగర్ 2 గేట్ల ఎత్తివేత

దేవరకద్ర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 32 అడుగులకు చేరింది. దీంతో రెండు గేట్ల ద్వారా 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు.

ప్రత్యేక మార్కెట్ యార్డు ఏర్పాటు ఎప్పుడో ?

» రాష్ట్రంలో 10 కొత్త మార్కెట్ యార్డులు ఏర్పాటు
» తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
» అందులో అయిజకు దక్కని చోటు


సబ్-మార్కెట్ యార్డ్‌లో విక్రయ ధాన్యం పోసేందుకు నిర్మించిన షెడ్లు

అయిజ టౌన్, ఆగస్ట్ 21 (ఆంధ్రజ్యోతి) : అయిజలో ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ యార్డు ఎప్పుడు ఏర్పాటయ్యేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడున్న సబ్‌మార్కెట్ అలంపూర్ మార్కెట్ యార్డు పరిధిలో కొనసాగుతోంది. ప్రతీ శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇక్కడి నుంచి పోటీలో ఉండే అభ్యర్థులు ప్రత్యేక మార్కెట్‌యార్డు ఏర్పాటు చేస్తామని హామీలు ఇస్తున్నారు. కానీ గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా 10 కొత్త మార్కెట్ యార్డులను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు 4 మార్కెట్ యార్డులు మంజూరైనా, అన్నీ కొల్లాపూర్ నియోజకవర్గానికే కేటాయించారు. అయిజకు మాత్రం చోటు దక్కక పోవడం రైతులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

1974లో సబ్ మార్కెట్ ఏర్పాటు

అయిజ పట్టణంలో 1974లోనే ప్రభుత్వం సబ్-మార్కెట్ యార్డును ఏర్పాటు చేసింది. అయిదు సంవత్సరాలు క్రయవిక్రయాలు కొనసాగాయి. ఆ తర్వాత రైతులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో నిలిచిపోయాయి. దీంతో నిరుపయోగంగా ఉన్న ఆ మార్కెట్ యార్డులో ఆరేళ్ల క్రితం వారాంతపు సంతను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంతకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రైతులు, కొనుగోలుదారులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఎద్దులు, మేకలు, గొర్రెలు, బర్రెలతో పాటూ, వ్యవసాయ పరికరాల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

రూ. 1.3 కోట్ల ఆదాయం

సబ్‌మార్కెట్‌లో క్రయవిక్రయాల ద్వారా మొదట్లో ఏడాదికి రూ. 2 లక్షల వరకు ఆదాయం సమకూరేది. ఆ తర్వాత క్రమంగా పెరుగుతూ 2024-25లో రూ. 21.61 లక్షలకు చేరింది. దీంతో పాటు మార్కెట్ యార్డ్ ఆవరణలోని నాబార్డు గోదాం ద్వారా ఏడాదికి రూ. 10.80 లక్షలు, సివిల్‌సప్లై గోదాం ద్వారా రూ.1.20 లక్షల అద్దె లభిస్తోంది. అయిజలోని వ్యవసాయ చెక్‌పోస్ట్ ద్వారా ఏడాదికి మరో రూ. 20 లక్షల ఆదాయం వస్తోంది. అలాగే రైస్‌మిల్లులు, పత్తి జిన్నింగ్ మిల్లుల ద్వారా రూ.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. మొత్తంగా అయిజ సబ్-మార్కెట్ యార్డు ద్వారా ఏ డాదికి ప్రతీ ఏడాది దాదాపు రూ. 1.3 కోట్ల వరకు ఆ దాయం వస్తోంది. అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు 2024-25 సంవత్సరానికి ఆదాయ లక్ష్యం రూ.2.44 కోట్లు ఉండగా, రూ. 4.07 కోట్లు వచ్చింది. అందులో రూ. 1.3 కోట్లు అయిజ సబ్‌మార్కెట్‌యార్డు నుంచే సమకూరింది. ప్రత్యేక వ్యవసాయ మార్కెట్‌గా గుర్తిస్తే ఆదాయం మరో కోటి రూపాయలు పెరిగే అవకాశం ఉంటుంది.

అయిజ నుంచే ఎక్కువ ఆదాయం



అలంపూర్ మార్కెట్ యార్డుకు గత రెండేళ్ల నుంచి అయిజ సబ్-మార్కెట్ యార్డు నుండే ఎక్కువ ఆదాయం వస్తోంది. ఏడాదికి రూ. 1.3 కోట్ల వరకు సమకూరుతోంది. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ప్రత్యేక వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు ఆరు నెలల క్రితమే నివేదికను ప్రభుత్వానికి పంపించాం. మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే మరో కోటి రూపాయల వరకు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

\- ఎల్లస్వామి,
మార్కెట్‌యార్డు సెక్రటరీ, అలంపూర్

వ్యవసాయశాఖ మంత్రికి విన్నవించాం



అయిజ సబ్-మార్కెట్ యార్డ్‌ను ప్రత్యేక మార్కెట్ యార్డ్‌గా మార్చాల్సి ఉంది. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సహకారంతో గతంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు విన్నవించాం. బుధవారం కూడా మంత్రిని కలిసి ప్రత్యేక మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని కోరాము. అందుకు సంబంధించిన జీవో త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది.

\- దొడ్డెప్ప,
మార్కెట్ కార్డు ఛైర్మన్, అలంపూర్

క్రైం కార్నర్

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

» రూ.11.43లక్షలు, 30 గ్రాముల బంగారు స్వాధీనం
» వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్


స్వాధీనం చేసుకున్న డబ్బు, నగదుతో పాటు పోలీసుల అదుపులో నిందితుడు

వనపర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. కేసు వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాన్‌గల్ మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీనుగ రమేశ్ కొన్ని నెలలుగా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. నెల రోజుల క్రితం వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చొరబడి 12 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి విచారణ చేపట్టారు. అందులో భాగంగా గురువారం తెల్లవారుజామున 5:30 సమయంలో జిల్లా కేంద్రం సమీపంలోని మర్రికుంటలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న రమేశ్ పోలీసులను చూసి తడబడ్డాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొన్నారు. ద్విచక్రవాహనంలోని బ్యాగులో సోదా చేయగా కొంత నగదు, స్క్రూ డ్రైవర్, బ్లేడు కనిపించాయి. దీంతో అతడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా, నాలుగు చోరీలకు పాల్పడ్డట్లు అంగీకరించాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లిలోని ఓ ఇంట్లో రూ. 11.43 లక్షలు చోరీ చేశాడు. వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 2 ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఓ ఇంట్లో 12 గ్రాముల బంగారం, కొత్తకోట పట్టణంలోని ఓ ఇంట్లో 18 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. దీంతో అతడిని అరెస్టు చేసి, కోర్టు ఆదేశం మేరకు రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణయ్య, రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి, ప్రొబేషనరీ ఎస్ఐ వేణుకుమార్‌లను ఎస్పీ అభినందించి, రివార్డులు అందించాడు.

వృద్ధుడి దారుణ హత్య

» వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో కలకలం


ఎనుముల కిష్టయ్య (ఫైల్)

పాన్‌గల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురైన ఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. పాన్‌గల్ గ్రామానికి చెందిన ఎను ముల కిష్టయ్య (68) ఇంట్లో ఒంటరిగా జీవిస్తూ వడ్డీలకు డబ్బులు ఇస్తూ మూగజీవాల వ్యాపారం చేస్తుంటాడు. బుధవారం బోనాల పండుగ సందర్భంగా అదే గ్రామంలో ఉండే కుమారుడి ఇంట్లో భోజనం చేసి తాను ఉంటున్న ఇంటికి వచ్చాడు. ప్రతీరోజు మాదిరిగానే తన ఇంట్లో నిద్రించాడు. గురువారం ఉదయం అటుగా వెళుతున్న ఓ మహిళ ఇంట్లోకి కోతులు వస్తున్నాయని, ఇల్లు మూసుకోమని చెప్పినా ఆయన నుంచి సమాధానం రాలేదు. దీంతో గది మూత దగ్గరకు వచ్చి చూడగా కిష్టయ్య మంచంపై రక్తపు మరకలతో పడి ఉండటాన్ని గమనించిన ఆమె చుట్టుపక్కల ఇళ్ల వారికి విషయం చెప్పింది. సమాచారం అందుకున్న మృతుని కుటుంబ సభ్యులు వచ్చి చూడగా ముఖంపై అతి దారుణంగా దాడి చేసిన రక్తపు గాయాలతో మృతి చెంది ఉన్నాడు. అతని వెంట ఉన్న వారే హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. మృతుని కుమారుడు శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ కృష్ణ తెలిపారు. సీసీఎస్ పోలీసులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో హత్య వివరాలను సేకరించారు. వృద్ధుని హత్యతో ఒక్కసారిగా మండల కేంద్రంవాసులు ఉలిక్కిపడ్డారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రావుల గిరిధర్

పాన్‌గల్‌లో హత్య జరిగిన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి సీఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, పాన్‌గల్ ఎస్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

మానవపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మతి స్థిమితం లేని వ్యక్తి అత్యధిక మోతాదులో ట్యాబెట్లు వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల పరిధిలోని చెన్నిపాడులో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉల్చా శ్రీరాములు(50) కొంత కాలంగా ఫిట్స్‌తో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడికి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అప్పటి నుంచి పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో టాబ్లెట్స్‌ను అధిక మోతాదులో వేసుకొని స్పృహ కోల్పోయి పడిపోయాడు. పొలం పనులకు వెళ్లి వచ్చిన ఆయన బార్య కంగలమ్మ గమనించి, అతడిని కర్నూల్ ఆసుపత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ 11 గంటల సమయంలో మృతి చెందాడు. సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నామోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం

నవాబ్‌పేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్ నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ విక్రం తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెంచు రాజు (33) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ పోషణ కోసం చేసిన చేసిన అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నాడు. దీంతో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో రేకుల కప్పు పైపునకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పనికి వెళ్లిన భార్య లక్ష్మమ్మ రాత్రి 7 గంటలకు ఇంటికి రాగా, తలుపులకు లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. దీంతో పక్క ఇంటి వారి సాయంతో తలుపులను తెరిచి చూడగా, రాజు ఉరివేసుకొని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బ్రెడ్ పాకెట్‌లో పురుగు

మక్తల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బేకరీలో తీసుకొన్న బ్రెడ్ ప్యాకెట్‌లో పురుగు కనిపించడంతో కొనుగోలుదారుడు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని యాదవ్‌నగర్‌కు చెందిన శ్రీరామ్ గురువారం సాయంత్రం అంబేడ్కర్‌నగర్‌లోని పాపులర్ బేకరీలో బ్రెడ్ ప్యాకెట్ కొన్నాడు. అందులో ఓ నల్లని పురుగు కనిపించడంతో అవాక్కయ్యాడు. వెంటనే యజ మానికి చూపించి ఆగ్రహం వ్యక్తం చేశాడు. పొరపాటు జరిగిందని, మరోసారి జరగకుండా చూస్తామని వారు అతడికి తెలిపారు.

కారు, లారీ ఢీ

మిడ్జిల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడియాల గ్రామ శివారులోని కేఎల్ఐ కాల్వ బ్రిడ్జి వద్ద కారు, లారీ ఢీకొన్న ఘటనలో జడ్పీటీసీ మాజీ శశిరేఖ భర్త బాలస్వామికి గాయాలయ్యాయి. బాలస్వామి కారులో జడ్చర్ల వైపు వెళ్తుండగా కల్వకుర్తి నుంచి వస్తున్న లారీ కారును ఢీకొనగా బాలస్వామికి గాయాలైనట్లు తెలిపారు.

'ఇథనాల్' బౌన్సర్లపై కేసు నమోదు చేయాలి

» అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
» ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి


ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి పత్రం ఇస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

వడ్డేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, పెద్ద ధన్వాడ రైతులపై దాడి చేసిన ఇథనాల్ పరిశ్రమకు చెందిన బౌన్సర్లపై కేసు నమోదు చేయించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కోరారు. ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆయన హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం సమర్పించి, సమస్యను వివరించారు. పరిశ్రమ బౌన్సర్లపై ఫిర్యాదు చేసి 60 రోజులు కావస్తున్నా, ఎఫ్ఐఆర్ చేయడం లేదని తెలిపారు. అందుకు స్పందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ స్పందించి డీఎస్పీతో ఫోన్లో మాట్లాడారు. వెంటనే కేసు నమోదు చేయాలని సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యులు నర్సింహులు, మరియమ్మ, భాస్కర్, మోషన్న, రాజు, అమృత రాజు, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

» తలపై బొడుపు, కమిలిపోయిన వీపు
» అయిజలోని ప్రైవేటు పాఠశాలలో ఘటన
» షోకాజ్ నోటీసు జారీ చేసిన ఎంఈవో


ఉపాధ్యాయుడు కొట్టడంతో ఎర్రగా కందిన విద్యార్థి వీపు


కృష్ణవేణి పాఠశాల నిర్వాహకుడికి షోకాజ్ నోటీసు అందిస్తున్న ఎంఈవో కార్యాలయ ఉద్యోగి బాబు

అయిజ టౌన్, అగస్ట్ 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలోని కృష్ణవేణి ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థిని చితకబాదాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన వెంకటేశ్, పద్మావతి దంపతుల కుమారుడు చరణ్‌తేజ కృష్ణవేణి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. నవోదయ పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. అయితే విద్యార్థి చరణ్‌తేజ హోంవర్క్ చేయకపోవడంతో బుధవారం సాయంత్రం ఉపాధ్యాయుడు రాము అతడి తలమీద, వీపుపై తీవ్రంగా కొట్టాడు. దీంతో తలపై బొడుపు కట్టింది. వీపు ఎర్రగా కమిలిపోయింది. ఆ తర్వాత ఇంటికి వెళ్లిన చరణ్ తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పాడు. దీంతో వారు గురువారం ఉదయం విద్యార్థి సంఘాల నాయకులకు బాలుడి ఫొటోలు పంపించారు. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారాయి. దీంతో స్పందించిన మండల విద్యాధికారి రాములు పాఠశాల నిర్వాహకుడు మధుసూదన్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. రెండు రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలంటూ, బాధ్యుడైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, నరేశ్, విజయ్, రహీం, శ్రీహరి, రాఘవేంద్ర, ఉమేశ్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలకు సుస్తీ

» వనపర్తి, ఆత్మకూరు పట్టణాల్లో ఏర్పాటు
» వైద్య సిబ్బంది కొరతతో ఇబ్బందులు
» కొత్తకోటలో ప్రారంభం కాని ఆసుపత్రి


వనపర్తిలోని బస్తీ దవాఖాన

వనపర్తి వైద్యవిభాగం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ, ప ట్టణ ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు గత ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసింది. జిల్లా ఆసుపత్రితో పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ఒత్తిడి తగ్గించేందుకు వనపర్తి జిల్లాకు మూడు బస్తీ దవాఖానాలు మంజూరు చేసింది. 2022లో వనపర్తి, ఆత్మకూరు పట్టణాల్లో దవాఖానాలను ప్రారంభించారు. కొత్తకోటలో బస్తీ దవాఖానా ఏర్పాటుకు సరైన భవనం దొరకడం లేదు. అధికారులుపలు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. కానీ అనుకూలమైన భవనం కనిపించలేదు. ప్రారంభంలో నాలుగైదు నెలల పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే సాయంత్రం వేళల్లో దవాఖానాను నిర్వహించారు.

ల్యాబ్ టెక్నీషియన్లు లేక అవస్థలు..

వనపర్తి, ఆత్మకూర్‌లలో బస్తీ దవాఖానాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. ఈ రెండు కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారు కానీ, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు లేరు. వనపర్తి బస్తీ ద వాఖానాలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తు న్న ఆమెకు రెగ్యులర్ పోస్టు రావడం తో వెళ్లిపోయింది. దీంతో రోగులు జి ల్లా ఆసుపత్రికి లేదా ప్రైవేట్ క్లినిక్‌ల కు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వ ర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్ర మాదం ఉంది. ఇలాంటి తరుణంలో బాధితులకు రోగ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి.

కానీ బస్తీ దవాఖానాల్లో ల్యాబ్ టెక్నీషన్ లేకపోవడంతో వైద్య పరీక్షల కోసం రోగులు అవస్థలు పడుతున్నారు. ఉన్న సిబ్బందే రోగుల రక్త నమూనాలు సేకరించి, నిర్ధారణ పరీక్షల టీహబ్‌కు కోసం పంపిస్తున్నారు. దీంతో రిపోర్టులు రావడంలో ఆలస్యం అవుతోంది.

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు లేవు



బస్తీ దవాఖానాలకు నిబంధనల ప్రకారం ల్యాబ్ టెక్నీషన్ పోస్టులు లేవు. అయినా రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి రోగ నిర్ధారణ కోసం టీహబ్‌కు పంపిస్తున్నాం. కొత్తకోటలో బస్తీ దవాఖానను త్వరలోనే ఏర్పాటు చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. సిబ్బందికి సంబంధించి ఎలాంటి ఇబ్బందీ లేదు. అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉన్నాయి.

\- డాక్టర్ అల్లే శ్రీనివాసులు,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, వనపర్తి

ఒడ్డుకు చేరిన మరబోట్లు

» నదీ తీర గ్రామాల ప్రజలకు ఇక్కట్లు


మంచాలకట్ట దగ్గర ఒడ్డుకు కట్టేసి ఉంచిన మర బోట్లు

పెంట్లవెల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదికి వరద పోటెత్తుతుండటంతో నాగర్‌కర్నూల్ జిల్లాలోని మంచాలకట్ట, మల్లేశ్వరం ప్రాంతాల్లో మర బోట్లు నిలిచిపోయాయి. కొల్లాపూర్ పరిసర ప్రాంతాలకు చెందిన వారికి ఏపీలోని రాయలసీమలో సంబంధ బాంధవ్యాలున్నాయి. వారు నిత్యం అటు నుంచి ఇటు, ఇటు నుంచి మరబోట్ల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. రాయలసీమ ప్రాంతంలోని కొండపాటూరు, నెహ్రూనగర్, కొణిదెల, బిజినవేముల, నాగుటూరు, మాడుగుల, ముచ్చుమర్రి, నందికొట్కూర్, ఆత్మకూర్, ఎర్రమట్టం, మునలిమడుగు, గుమ్మడాపురం, సంగమేశ్వరం తదితర ప్రాంతాలకు మంచాలకట్ట మీదుగా వెళ్తే 8 నుంచి 15 కిలోమీటర్ల దూరం అవుతుంది. మరబోటులో ప్రయాణానికి ఒక్కొక్కరికి రూ.50, ద్విచక్రవాహనానికి రూ.50 తీసుకుంటారు. ప్రస్తుతం మర బోట్లు నిలిచిపోవడంతో చుట్టూ తిరిగి కర్నూలు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అందుకు 130 నుంచి 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో సమయం వృథా కావడంతో పాటు, డబ్బు కూడా ఎక్కువ ఖర్చు అవుతుందని ప్రజలు చెప్తున్నారు. సోమశిల, సిద్ధేశ్వరం వంతెన నిర్మాణం పూర్తయితేనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

» పీఎం జన్‌మన్ పథకం వైద్యాధికారి మోహన్‌పాల్ నాయక్


చెంచు గర్భిణులకు ఆరోగ్య కార్డులను అందజేస్తున్న డాక్టర్ మోహన్‌పాల్ నాయక్

మన్ననూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని పీఎం జన్‌మన్ పథకం వైద్యాధికారి డాక్టర్ మోహన్‌పాల్ నాయక్ అన్నారు. జిల్లా వైద్యాశాఖ ఆధ్వర్యంలో నల్లమల అభయారణ్య ప్రాంతంలోని మల్లాపూర్ పెంటలో గురువారం సంచార వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గిరిజనులకు మలేరియా, టైఫాయిడ్, బీపీ, మధుమేహ పరీక్షలను నిర్వహించారు. గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి, ఆరోగ్య కార్డులను అందించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చెంచులకు అవగాహన కల్పించారు. ఎవరికైనా జ్వరం వస్తే ల్యాబ్ టెక్నీషియన్లకు రక్త నమూనాలు ఇవ్వాలని, వైద్యులు సూచించిన మందులనే వాడాలని చెప్పారు. చెంచు పెంట పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రాజు, స్టాఫ్ నర్సు కావ్య, ఆరోగ్య సహాయకులు ఆంజనేయులు, స్వామి పాల్గొన్నారు.

మార్వాడీ దుకాణదారులపై ఫిర్యాదు

తిమ్మాజిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తిమ్మాజిపేటలో వ్యాపారం చేస్తున్న మార్వాడీలపై స్థానికులు గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తిమ్మాజిపేటకు చెందిన రామాంజనేయులు అనే వ్యక్తికి బుధవారం సాయంత్రం రూ.1100 తీసుకుని ఓరియంటల్ సీలింగ్ ఫ్యాన్ ఇచ్చిన భవాని ఓమ్ అప్లాయిన్స్ యజమాని నాణ్యత లేని వస్తువులను విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు మర్వాడీ దుకాణం ముందు నిరసన తెలిపారు. శేఖరయ్య, నాగేష్, మూస, గంగాధర్, రాములు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- మహేష్ గౌడ్, ఎస్ఐ, వంగూరు



వంగూరు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న గణేశ్‌ఉత్సవాలను అన్నికులాల వారు ఇతర వార్గల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ మహేష్‌గౌడ్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలా ?

విగ్రహాలను ఏర్పాటు చేసే వారు విధిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అప్లై చేసిన డౌన్ లోడ్ కాపీలను ఒకటి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలి. మరొక కాపీని మండపం దగ్గర ఉంచాలి. సంబంధిత అధికారులు తనిఖీ చేయడానికి వస్తే ప్రతిని చూయించాలి.

డీజేలకు అనుమతి ఉందా ?

గణేశ్ విగ్రహాల ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదు. గణేశ్ మండపాల వద్ద ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైక్‌లు వాడాలి.

ఉత్సవాల ప్రశాంతతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

గణేశ్ మండపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. సిబ్బందిని అప్రమత్తం చేసి గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకుంటాం. ఇందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు సహకరించాలి.

ఉత్సవాల నిర్వాహకులకు మీరిచ్చే సూచనలు ఏంటీ?

గణేశ్ మండపాల నిర్వాహకులు నియమ నిష్టలతో ఉండాలి. ఎలాంటి మద్యపానం, ఇతర మత్తు పదార్థాలు సేవించరాదు. మైక్ సౌండ్ భారీగా పెంచి, శబ్ద కాలుష్యం కలిగించవద్దు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలి.

న్యూస్ బాక్స్

తెగిన వంతెనను పరిశీలించిన పీఆర్ ఏఈఈ

చారకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు వరద తాకిడికి మండలంలోని తిమ్మాయిపల్లి శివారులో వంగూరుగేట్ వెళ్లే రోడ్డులో ఉన్న వంతెన తెగిపోయింది. ఆ వంతెనను గురువారం పంచాయతీ రాజ్ ఏఈఈ దివ్య పరిశీలించారు. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాలకు మేరకు వంతెనను పరిశీలించినట్లు తెలిపారు. నూతన వంతెన నిర్మాణానికి నివేదిక పంపిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్, నాయకులు తిరుమలేష్, ప్రభాకర్, బక్కయ్య, రాజేష్, రైతులు కృష్ణారావు, సతీశ్, కొండల్ ఉన్నారు.

‘దొంగ ఓట్లతో గెలిచే అవసరం బీజేపీకి లేదు’

అచ్చంపేట రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నట్లుగా దొంగ ఓట్లు వేయించుకుని గెలవాల్సిన అవసరం బీజేపీకి లేదని అఖిల భారతీయ విశ్వకర్మ జాతీయ ఉపాధ్యక్షురాలు తేజస్విని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని మోదీ చేపడుతున్న కార్యక్రమాల వల్ల బీజేపీ విజయబాటలో పయనిస్తుందని అన్నారు. యూరియా విషయంలో కేంద్రంపై రాష్ట్ర మంత్రులు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

సబ్సిడీ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

వెల్దండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో స్మామ్ పథకంలో భాగంగా రైతులు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి శోభారాణి తెలిపారు. ఈ పథకంలో ఎస్సీ, ఎస్టీలకు 50శాతం, ఇతరులకు 40శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హతగల రైతులు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

‘కొల్లాపూర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలి’

కొల్లాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపాలిటీలో అండర్ గ్రౌండ్ సైడ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కొల్లాపూర్ మునిసిపాలిటీ కేంద్రంలో సీపీఎం బృందం వివిధ వార్డులను పరిశీలించారు. 4, 7, 13వ వార్డులలో మురుగునీరు రోడ్లపై పారుతూ పాకర పట్టి ద్విచక్ర వాహనాలు జారిపడుతున్నాయన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సలీం, నాయకులు నరసింహ,రాముడు, సంజీవ్, రాజు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చారకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరం లాంటిదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాలరాంగౌడ్ అన్నారు. చారకొండ తిరుపతమ్మకు రూ.44 వేలు, అగ్రహారంతండా గ్యార నరేష్‌కు రూ.60 వేలు, వంకరాయితండా నేనావత్ అంజికి రూ. 24వేలు, సారంబండ తండాకు చెందిన కేతావత్ సుధాకు రూ. 17,500, సిరసనగండ్లకు చెందిన పసుల చంద్రమౌళికి రూ. 30 వేలు, తిప్పర్తి శ్రావణికి రూ.60వేలు, నూకలచింతవాడికతండాకు చెందిన కేతావత్ కవితకు రూ.17,500 మంజూరైన చెక్కులను గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశా రు. శివ, లక్ష్మణ్‌గౌడ్, భీందాస్‌నాయక్ ఉన్నారు.

చేతికి అందే ఎత్తులో..



ఊర్కొండపేట పాఠశాల ప్రహరీ పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- పట్టించుకోని విద్యుత్ అధికారులు

ఊర్కొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చాలా చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదపుటంచుల్లో ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంతో పాటు ఊర్కొండపేట, ముచ్చర్లపల్లి, బొమ్మరాజుపల్లి, జకినాలపల్లి, నర్సంపల్లి గ్రామాల్లో చేతికి అందే ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడంతో ఎప్పుడు, ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊర్కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు నిత్యం భయపడుతూ విద్యార్థులకు జాగ్రత్తలు చెబుతూ పాఠశాలకు పంపిస్తున్నారు. ప్రహరీ చిన్నదిగా ఉండటం, విద్యుత్ తీగలు చేతికి తగిలేవిధంగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయం భయంగా గడుపుతున్నారు. అదేవిధంగా ప్రధాన రహదారి పక్కనే పాలసెంటర్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు వాహనాలు తగిలే అవకాశం ఉంది. దీంతో చాలా మంది వాహనదారులు అటువైపు వెళ్లకుండా, మరోదారి గుండా వెళుతున్నారు. అదేవిధంగా ముచ్చర్లపల్లి, బొమ్మరాజుపల్లి గ్రామాల్లో ఇళ్ల మధ్యనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల ఆ గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంచాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల నుంచి మార్చాలి



ఊర్కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్చాలి. విద్యార్థులు నిత్యం అక్కడి నుంచి రాకపోకలు కొనసాగిస్తుటారు. పాఠశాల మైదానంలో ఆటలు ఆడుతూ అనుకోకుండా వాటికి తగిలే ప్రమాదం ఉంది. విద్యుత్ శాఖ అధికారులు పాఠశాల ప్రహరీపై నుంచి వేరే చోటికి మార్చాలి.

- మొండెల్ల కృష్ణ, ఊర్కొండ పేట

నెల రోజుల్లో సిర్సవాడ కాజ్‌వేకు టెండర్లు

- రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వివరించిన జిల్లా అధికారులు



సిర్సవాడ వద్ద దుందుభీ నదిలో కాజ్‌వేను పరిశీలిస్తున్న రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, కలెక్టర్, ఎస్పీ, అధికారులు

తాడూరు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడలో దుందుభి నదిలో ఉన్న కాజ్‌వే వరద ప్రవాహానికి శిథిలావస్థకు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గురువారం రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా దుందుభీ నదిలో తలెత్తుతున్న సమస్యలు, రైతులు, గీత కార్మికులు పడుతున్న ఇబ్బందులు, నాలుగేళ్లుగా నదిలో జరిగిన ప్రమాదాలను జిల్లా అధికారులు ఆయనకు వివరించారు. అదేవిధంగా గత మార్చిలో నూతనంగా మంజూరైన వంతెన వివరాలను వివరించారు. టెండర్ ప్రక్రియ వచ్చే నెలలో పూర్తైన అనంతరం రాన్న రెండు మూడు నెలల్లో వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఇరిగేషన్‌శాఖ అధికారులు ఆయనకు వివరించారు. అదేవిధంగా చెర్లతిర్మలాపూర్, ఉయ్యాలవాడ మధ్య ఉన్న ఇబ్బందికర పరిస్థితులను సైతం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమిపూజ



మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావును సన్మానిస్తున్న ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు

కొల్లాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కొల్లాపూర్ మునిసిపాలిటీ 10వ వార్డులో భూమిపూజ చేసి పనులను మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు, మాజీ మునిసిపల్ కౌన్సిలర్ షేక్ రహీంపాషా ప్రారంభించారు. అధికారులు లబ్ధిదారులకు స్థలాల్లో మ్యాపింగ్ చేసి వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. లబ్ధిదారులు మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు, హౌసింగ్ ఏఈ రాజవర్ధన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ రహీంపాషాలను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు మేకల నాగరాజు, రెడ్డిసత్యం, మాజీ మునిసిపల్ వార్డు ఆఫీసర్ సాధికాబేగం, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కల్వకుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వి.సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి డిపో పరిధిలోని ప్రయాణికులు, ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారస్తులు తమ సలహాలు, సూచనలు 9959226292కు మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంట వరకు ఫోన్ చేసి తెలియజేయాలని ఆమె కోరారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి : ఎన్ఎస్‌యూఐ

మన్ననూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారని ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ నల్లవెల్లి యశ్వంత్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఆదేశానుసారం అమ్రాబాద్ మండలం మన్ననూరులోని అంబేడ్కర్ కాలనీ ప్రాథమిక పాఠశాలను ఎన్ఎస్‌యూఐ నాయకులు గురువారం సందర్శించారు. ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన భోజనం వడ్డించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు.

బీజేపీ నాయకుల వినతి

కల్వకుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మునిసిపాలిటీలోని వార్డులను క్రమ పద్ధతిలో విభజన చేయాలని కోరుతూ తహసీల్దార్ జనార్దన్‌రెడ్డికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. పట్టణంలో వార్డుల విభజన అన్ని పార్టీల సమ్మతితో చేయాలని పేర్కొన్నారు. పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లను తమ ఇష్టానుసారంగా వార్డులకు మారుస్తున్నారని అన్నారు. చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, నాయకులు బాబీదేవ్, నరసింహ, కృష్ణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, విజయ్, చందు, శివ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని శుక్రవారం పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కల్వకుర్తి ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని వాసవినగర్, ఎల్లికల్ రోడ్డు, కూరగాయల మార్కెట్, శిల్పిహోటల్, ఆర్అండ్‌బీగెస్ట్ హౌస్, సిల్వర్ జుబ్లీ క్లబ్ ఏరియా, గాంధీనగర్, బ్రహ్మంగారి గుడి ప్రాంతాల్లో ఐసీడీఎస్ ఉప కేంద్రం 11కేవీ లైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని ఏఈ కోరారు.

నేడు బీఆర్ఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశం

ఉప్పునుంతల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే, అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి జనార్దన్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వ్యవసాయానికే యూరియా వినియోగించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

బిజినేపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : యూరియాను వ్యవసాయ అవసరాలకే వినియోగించుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఎరువులు, క్రిమి సంహారక మందుల విక్రయ కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి ఎరువుల నిల్వల రికార్డులను పరిశీలించి మాట్లాడారు. రైతులు వ్యవసాయ అధికారులు సూచించిన మోతాదు మేరకే ఎరువులను వాడాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల సాధన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులను మేథమెటిక్స్‌పై పలు ప్రశ్నలు వేసి లెక్కలు బోధిస్తూ మాస్టర్‌గా మారిపోయారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరాలంటే పదవ తరగతి తొలి మెట్టు అని అన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి కమల్‌కుమార్ ఉన్నారు.



బోనాల ఉత్సవాల్లో ఆనంద్‌కుమార్



కులదేవతకు పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

కల్వకుర్తిలో ఘనంగా బోనాల పండుగ

కల్వకుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో శ్రీపోచమ్మ దేవత బోనాలు గురువారం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. పట్టణంలోని నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలు మూడు రోజులుగా కొనసాగాయి. చివరి రోజు మహిళలు బోనాలను అలంకరించుకుని ఊరేగింపుగా సాగి పోచమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్లు ఎడ్మ సత్యం, రాచోటి శ్రీశైలం, స్థానిక మాజీ కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డిలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్యవైశ్యుల వనమహోత్సవం

మన్ననూర్ : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. కులస్తులంతా ఒక చోట చేరి అడవిలోనే వంటలు చేసి సామూహికంగా వనభో జనాలు చేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర ఆలయ పాలకమండలి డైరెక్టర్ సంబు శోభ, ఆర్యవైశ్య సంఘం నాయకులు సంబు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణపాల్గొన్నారు.

● అమ్రాబాద్ : మండల కేంద్రంలో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి వివిధ సామాజిక వర్గాల ప్రజలు లోకేశ్వరం చెరువు సమీపంలో గుట్టపైకి వెళ్లారు. చెరువు అలుగు పారుతుండడంతో యువకులు సందడి చేశారు.

ఒకటిన మహాధర్నాను జయప్రదం చేయాలి



కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కల్వకుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు మర్యాద కృష్ణారెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ చేపట్టనున్న మహాధర్నా వాల్‌పోస్టర్లను గురువారం ఎంఈవో శంకర్ నాయక్‌తో కలిసి పీఆర్‌టీయూ నాయకులు భోజన విరామ సమయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు ప్రసూన, వెంకటరమణ, బాలునాయక్, పద్మ, విష్ణుమూర్తి, పీఆర్‌టీయూ మండల కార్యదర్శి రియాజ్, జిల్లా బాధ్యులు అబ్దుల్ సుభాన్, నారాయణరావు, శంకర్‌రావు, వహీద్, సందీప్ ఉన్నారు.

● ఉప్పునుంతల : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ పాఠశాలలో గురువారం పీఆర్‌టీయూటీఎస్ ఉప్పునుంతల శాఖ ఆధ్వర్యంలో మహాధర్నా వాల్‌పోస్టర్లను సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బిచ్యానాయక్ ఆవిష్కరించారు. ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మల్లికార్జున్, శ్యామ్‌సుందర్‌గౌడ్, అజ్మతుల్లా, రాములునాయక్, అమీర్ పాషా పాల్గొన్నారు.

అమరేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా తిప్పర్తి శ్రీనివాస్



అమరేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన తిప్పర్తి శ్రీనివాసులును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అమ్రాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ అమరేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన తిప్పర్తిశ్రీనివాస్ ఎంపికయ్యారు. గురువారం అమరేశ్వర ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గంగిశెట్టి నాగరాజు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. ఉపాధ్యక్షులుగా గోలి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా నోముల యుగేందర్‌గౌడ్, కోశాధికారిగా శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా శివనారాయణ, పసుల వీరయ్య, తాడెం మల్లేష్, ఉప్పల భాస్కర్, చింతకుంట రాజు, అరవింద చారి, మల్లేష్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు అధ్యక్షుడు శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



బీకే తిర్మలాపూర్‌లో రేణుకాఎల్లమ్మ దేవత ఆలయ ముఖద్వారాన్ని దాత ముద్దునూరు శేషయ్యతో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ బలో పేతానికి ప్రతీ ఒక్కరు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని అవసలికుంట గ్రామంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రంగినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలాంటి వారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని ఆయన సూచించా రు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. అచ్చంపేట పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుకలకు కల్యాణలక్ష్మి చెక్కులు ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ, శివ, గోపాల్‌రెడ్డి రాంబాబు, అనంతరెడ్డి, రఘు ఉన్నారు.

బీకే తిర్మలాపూర్‌లో...

అమ్రాబాద్ : మండల పరిధిలోని బీకే తిర్మలాపూర్ గ్రామంలో రేణుకాఎల్లమ్మ దేవత ఆలయ ముఖద్వారాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ గురువారం ప్రారంభించారు. మండల పరిధిలోని మన్ననూర్ గ్రామానికి చెందిన ముద్దునూరు శేషయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అమ్రాబాద్‌లో అచ్చంపేట- మద్దిమడుగు ప్రధాన రహదారిపై ఈ ఆలయ ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దాత ముద్దునూరు శేషయ్య, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి పర్యటన

కొల్లాపూర్ , ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సోమశిల వెల్‌నెస్, స్పిరిచువల్ రీట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా కొల్లాపూర్ మండలం అమరగిరి ఐలాండ్ అభివృద్ధి పనులకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం శ్రీకారం చుట్టనున్నారు. అమరగిరిలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

● ఉదయం 10 గంటలకు అమరగిరి దీవిలో వెల్‌నెస్ రీట్రీట్‌కు శంకుస్థాపన, ఉదయం 11 గంటలకు సోమశిల పర్యాటక అభివృద్ధికార్యక్రమాలకు శంకుస్థాపన, ఉదయం 11:45 గంటలకు యంగంపల్లితండా, పెంట్లవెల్లి మండలం, అంగన్వాడీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన, మధ్యాహ్నం 12:15 గంటలకు పెంట్లవెల్లి గ్రామం, మండలం వద్ద పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ రహదారి (పెంట్లవెల్లి నుంచి మంచాలకట్ట వరకు) శంకుస్థాపన, మధ్యాహ్నం 12:30 గంటలకు కోడేరు మండలం ఎత్తం గ్రామం, జిల్లా కేంద్రం వద్ద పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ రహదారి, కల్వకోల్ నుంచి మైలారం వరకు శంకుస్థాపనలో పాల్గొంటారు.

18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో జనార్దన్‌రెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో జనార్దన్‌రెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని కల్వకుర్తి, వెల్దండ, ఆమనగల్లు, చారకొండ, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల మండలాల రాజకీయ నాయకుల సమావేశం ఆర్డీవో జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 1200 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. 2025 జూలై 1వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఫారం-6ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో రవికుమార్



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న రవికుమార్

వెల్దండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి రవి కుమార్ సూచించారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని రవికుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, మౌలిక వసతులగూర్చి అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సంక్రమిస్తే ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని అన్నారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని రవికుమార్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, సూపర్‌వైజర్ మురళి, ఫార్మసిస్టు అనిత, ల్యాబ్‌టెక్నీషియన్ శ్రీనివాస్, ఏఎన్ఎం సూర్యకళ, యుడీసీ శోభ ఉన్నారు.

ప్రపంచ ఔత్సాహిక దినోత్సవంపై అవగాహన

కొల్లాపూర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ ఔత్సాహిక దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వనపర్తి జిల్లా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య మాట్లాడుతూ నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా సంప్రదాయ పద్ధతిలో కాకుండా నూతన ఆలోచన విధానాన్ని కలిగి ఉండాలని విద్యార్థులకు తెలిపారు. వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామరాజు యాదవ్ మాట్లాడుతూ ప్యాసివ్ ఇన్‌కమ్, యాక్టివ్ ఇన్‌కంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కేశవులు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మంచి ఔత్సాహికులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎన్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ నూతన ఆలోచ నలకు అనుగుణంగా తార్కికంగా ఆలోచించి ముందడుగు వేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఉత్సవ నిర్వాహకుల సమావేశంలో కొల్లాపూర్ సీఐ మహేష్



పెద్దకొత్తపల్లిలో మాట్లాడుతున్న సీఐ మహేష్

పెద్దకొత్తపల్లి/ బిజినేపల్లి/ ఊర్కొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకో వాలని కొల్లాపూర్ పోలీస్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేష్ సూచించారు. ఈ నెల 27వ తేదీన గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్గనైజర్లతో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఎస్ఐ వి.సతీశ్‌తో కలిసి సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో కులమ తాలకతీతంగా సోదరభావంతో వినాయక చవితిని నిర్వహించుకోవాలని సూచించారు. ప్రతీ గ్రామంలోని ఏ వార్డులో ఏర్పాటు చేస్తున్నారో ముందస్తుగా పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని వారు తెలిపారు. మండపాల వద్ద విద్యుత్ సౌకర్యం కోసం విద్యుత్ అధికారుల దగ్గర అనుమతి తీసుకోవాలని సూచించారు. రాత్రివేళల్లో వినాయకుడి దగ్గర ఒకరు కాపలాగా ఉండి లడ్డులు, హుండీలు జాగ్రత్తగా ఉండేందుకు ఉండాలని వారు పేర్కొన్నారు. 9వ రోజు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయాలని వారు వెల్లడించారు. నిమజ్జనం రోజున డీజేలు ఏర్పాటు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. ఎంపీడీవో నాగేంద్రం, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్, వివిధ గ్రామాల పంచా యతీ కార్యదర్శులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

బిజినేపల్లిలో ఎస్ఐ కే.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్‌లో ఆయా గ్రామాల్లో వినాయక మండపాల నిర్వాహకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది చిన్ననాయక్, సురేందర్, శేఖర్, జితేందర్ నాయక్, కల్పన, అమృత, మౌనిక, రియాన్ బేగం ఉన్నారు.

ఊర్కొండలో ఎస్ఐ కృష్ణదేవ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి సమావేశం ఏర్పాటు మాట్లాడారు. గ్రామాల్లో డీజేలు వాడేవారు పోలీసులకు తప్పనిసరిగా సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది భూపతిరెడ్డి, కాంతికుమార్, హర్ష, శ్రీనివాస్ నాయకులు మ్యాకల శ్రీనివాసులు, కొమ్మురాజయ్య, వహీద్, శ్రీకాంత్, బ్రహ్మచారి ఉన్నారు.